మామిడి పోతోంది..!

- పొగ మంచుతో మామిడి పూతకు చేటు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం
- ఆందోళన చెందుతున్న రైతులు
- నియోజకవర్గంలో 4,584 ఎకరాల్లో సాగు

ప్రత్తిపాడు రూరల్: ఎండాకాలం ప్రారంభమైనా గ్రామాలను మంచు వీడటం లేదు. ప్రతిరోజూ తెల్ల వారుజాము నుంచి ఉదయం వరకూ పల్లెలను మంచు కమ్మేస్తోంది. పొగమంచు కారణంగా మామిడి పూత మాడిపోతోంది. నిన్నమొన్నటి వరకూ పూతతో కళకళలాడిన మామిడి చెట్లు ప్రస్తుతం మాడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా నవంబర్ నుంచి డిసెంబర్ నెలాఖారు వరకు మామిడి పూత పట్టి జనవరిలో పిందెలు దిగాలి. కాగా ఈ ఏడాది ఆలస్యంగా మామిడి పూత పూసింది. ఇటీవల పొగ మంచు ఎక్కువగా కురవడంతో ఆశాజనకంగా పూసిన పూత మాడిపోతోంది.

నియోజకవర్గంలో సాగు ఇలా..

ప్రత్తిపాడు నియోజకవర్గంలో సుమారు 4,584 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. ప్రత్తిపాడు మండలంలో 1,430 ఎకరాలు, ఏలేశ్వరంలో 97, శంఖవరంలో 1,971, రౌతులపూడిలో 1,086 ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 80 శాతం తోటలు పూతతో కళకళలాడుతున్నాయి. మరో 20 శాతం పూత రావల్సి ఉంది. పూత నిలబడేందుకు రైతులు విరివిగా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు.

దిగుబడిపై ఆందోళన

పొగమంచు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. పూత రావడం ఆలస్యం కావడంతో పంట చేతికొచ్చే సమయానికి వర్షాలకు నేలపాలవుతుందనే ఆందోళన రైతులను వెంటాడుతోంది. మామిడి పంట బాగా పండితే హెక్టారుకు 8 టన్నుల దాకా దిగుబడి వస్తుంది. ఏటా డిసెంబర్, జనవరి మాసాల్లో పూర్తి స్థాయిలో పూత వస్తోంది. ఏప్రిల్ రెండో వారం నుంచి పంట కోత దశకు చేరుకుంటుంది. అప్పటి నుంచి జూన్ మొదటి వారం దాకా మామిడి కోతలు కొనసాగుతాయి. త్వరగా చేతికొచ్చిన పంటకు మార్కెట్లో మంచి ధర దక్కుతుంది. ఆలస్యంగా కోతకు వస్తే ఆశించిన స్థాయిలో ధరలు ఉండవు. ఈ సారి ఆలస్యంగా పూత రావడంతో ఆశాజనకంగా దిగుబడి వస్తుందా..? అంతేస్థాయిలో ధర దక్కుతుందా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పొంచి ఉన్న తెగుళ్ల బెడద

మామిడి తోటలు ఆలస్యంగా పూత పూయడంతో తెగుళ్లు సోకే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు ఉద్యానశాఖాధికారులు ప్రతి గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తెగుళ్ల నివారణ, పూత నిలబడేందుకు సూచనలు సలహాలు ఇస్తున్నారు.

పిందె దశలో..

మామిడిలో బోరాన్ లోపం ఉన్న తోటల్లో పూత బాగా వచ్చినా ఫలదీకరణం సరిగ్గా జరగకపోవడం వల్ల పిందె కట్టు సరిగా ఉండదు. బోరాన్ లోపాన్ని నివారించి పిందెకట్టు కోసం మొగ్గ బయటకు రాకముందే 2 గ్రాముల బోరాక్స్ పొడరును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కొత్త చిగురు, పూమొగ్గ పెరుగుదల దశలో 1.5-2.0 గ్రాములు జింకు సల్ఫేట్, 1.25 గ్రాముల బోరాన్ లీటరు నీటిలో కలిపి చెట్లు బాగా తడిచేట్లు పిచికారీ చేయాలి. తేనె మంచు, తామర పురుగు నివారణకు మొగ్గ దశలో 0.3 మిల్లీ లీటర్ల ఇమిడోక్లోప్రిడ్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్, ఒక మిల్లీ లీటరు డైఫెన్ కొనజోల్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పచ్చి పూత దశలో బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకము 3 గ్రాముల లేదా ట్రిడిమార్ఫ్ లేదా డైనోకాప్ ఒక మిల్లీ లీటర్ లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఉద్యాన శాఖ అధికారులు సూచించారు.

పిందె, కాయ రాలిపోకుండా..

అధిక ఉష్ణోగ్రత, అధిక తేమ, నీటి ఎద్దడి, చీడపీడల కారణంగా పిందె, కాయ రాలిపోతుంది. నీటి ఎద్దడి ఉన్నప్పుడు ఒక తేలిక పాటి తడి పెట్టాలి.ఎన్ఏఏ 20 పీపీఎం లేదా ప్లానోఫిఫిక్స్ ఒక మిల్లీ లీటరు, 4.5 లీటర్ల నీటిలో కలిపి పిందె బఠాని గింజ సైజులో ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. తామర పురుగులు, తేనె మంచు పురుగుల నివారణకు ఫిప్రోనిల్ లేదా హస్టాథియాన్ 2 మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వీటితో పాటు మ్యాంకోజెబ్ 2 గ్రాములు లేదా బినోమిల్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మార్చి నెలలో అకాల వర్షాలు పడితే వచ్చే తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచించారు.



మంచు ప్రభావంతో మాడిపోయిన మామిడి పూత



మామిడిలో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి శ్రీవల్లి

ఏటా నష్టాలు తప్పడం లేదు



మామిడి సాగు ఆశాజనకంగా లేదు. ప్రతి ఏడాది నష్టపోతున్నాం. గతేడాది పూత తక్కువగా వచ్చింది. వచ్చిన పూత పిందెకాలేదు. ఈ ఏడాది పూత ఎక్కువగా వచ్చింది కాని పొగ మంచు ప్రభావంతో మాడిపోతోంది. ఇప్పుడు ఎరువులు, మందులకు అప్పులు చేశాం. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఎరువులు, పురుగు మందులతో పాటు పండుఈగ బుట్టలు ఉచితంగా అందించి ఆదుకోవాలి.

–గొనగాల గోపి, రైతు, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం

రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఈ ఏడాది పూత రావడం కొంత ఆలస్యమైంది. ఇటీవల పొగ మంచు విస్తారంగా కురిసింది. దీని ప్రభావం మామిడి పూతపై పడింది. ఈ సమయంలో రైతులు తీసుకోవల్సిన జాగ్రతలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు ఆయా దశల్లో అప్రమత్తంగా ఉండి మామిడి పంటను సంరక్షించుకోవాలి.

–శ్రీవల్లి, ఉద్యానశాఖాధికారి, ప్రత్తిపాడు

అధికారపక్షం వారికే ఉపాధి పనులు

- సర్పంచ్ జిగటాల వీరబాబు ఆరోపణ
- వాడీవేడిగా మండల సమావేశం

కోటనందూరు: అధికార కూటమి పార్టీలకు చెందిన కూలీలు, కార్యకర్తలకు మాత్రమే ఉపాధిహామీ పనులు కల్పిస్తున్నారని, కూటమి నేతలకు చెందిన ప్రాంతాల్లోనే పనులు చేస్తున్నారని భీమవరపుకోట సర్పంచ్ జిగటాల వీరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు కూలీలందరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ ఉపాధి పనులు కల్పన, అమలు తీరు అత్యంత అధ్వానంగా ఉందని మండిపడ్డారు. టీడీపీ కార్యకర్తలే ఉపాధి మేట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. భీమవరపుకోటలో ఏడాది క్రితం జల్‌జీవన్ మిషన్ పథకంలో పైపులైన్ పూర్తి చేసినా..నేటికీ ఇళ్లకు కుళాయి కనెక్షలు ఇవ్వలేదన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మండల మహిళా సమాఖ్య, ఉపాధి హామీ, పశువైద్యం, ఇరిగేషన్ తదితర శాఖల ప్రగతిపై ఎంపీపీ శ్రీనివాసు సమీక్షించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, ఈఓపీఆర్డీ ఎస్.జయరాం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివాజీ, సీడీపీఓ శ్రీలత, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ జిగటాల వీరబాబు

అరుణాచలేశ్వరస్వామికి విశేష పూజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పండితులు స్వామి వారికి సామూహిక మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థినులకు మగ్గం వర్క్‌పై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: మహిళా సాధికారితతోనే అభివృద్ధి సాధ్యమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత అన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, మహిళా సాధికారిత విభాగం, వినయ్ సుంకర ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు మగ్గం వర్క్‌పై శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలంటే వ్యక్తిగత నైపుణ్యం ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ ప్రగడ ప్రయాగమూర్తి, శిక్షకులు రూప, మీనా, గనిలక్ష్మి, కుమారి, తేజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



జగ్గంపేటలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి
- అంగన్‌వాడీ సిబ్బందికి క్రీడా పోటీలు

శంఖవరం: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శంఖవరంలో సోమవారం అంగన్‌వాడీ సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, కోకో పోటీల్లో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలను సీడీపీఓ పద్మావతి అభినందించారు. విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి ఆటల పోటీలు

జగ్గంపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అంగన్‌వాడీ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు కబడ్డీ, కోకో, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. వీరిలో 24 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారని సీడీపీఓ పూర్ణిమ తెలిపారు.



శంఖవరంలో కోకో ఆడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

నెహ్రూ కాలనీలో తనిఖీలు

జగ్గంపేట: స్థానిక నెహ్రూ కాలనీలో సోమవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 18 వీధులను జల్లెడ పట్టారు. అజ్ఞాత వ్యక్తులు నెహ్రూ కాలనీలో మకాం వేశారని, గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ముగ్గురు ఎస్సైలు, సీఆర్పీఎఫ్ సిబ్బంది, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఊరూపేరు లేని వారికి ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దని సూచించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనిపించినా, గంజాయి అమ్మకాలు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, గండేపల్లి ఎస్సై శివనాగబాబు, కిర్లంపూడి ఎస్సై సతీష్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేట నెహ్రూ కాలనీలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వ్యక్తి అదృశ్యంపై కేసు

తొండంగి: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై జగన్మోహన్‌రావు సోమవారం తెలిపారు. మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన సిద్దా వెంకటరామయ్య ఈ నెల 12న పొలంలోకి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య విజయకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని పాదచారునికి గాయాలు

తొండంగి: బెండపూడి శివారు వై జంక్షన్ వద్ద పాదచారుని బస్సు ఢీకొట్టిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జగన్మోహన్‌రావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పి.ఇ.చిన్నాయపాలెం గ్రామానికి చెందిన ములికి చంద్రరావు ఆదివారం అన్నవరం వైపు వెళ్తుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి వైజాగ్ వైపు వెళ్తున్న కేపీఎన్ ట్రావెల్స్ బస్సు చంద్రరావును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రరావు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దాపురం: పట్టణంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్సై మౌనిక సోమవారం సాయంత్రం తెలిపారు. ఈ దాడిలో రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

రసాభాసగా మండల సమావేశం

- అరుపులు, కేకలతో దద్దరిల్లిన సమావేశపు హాలు
- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపుపై చర్చ

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. సభ్యుల అరుపులు, కేకలతో సమావేశపు హాలు దద్దరిల్లింది. ఎవరేమి మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, పోలీసు సిబ్బంది జోక్యంతో వివాదం సద్దుమణిగినా చివరి వరకూ వాదొపవాదనలతోనే సభ ముగిసింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖల వారీగా సమీక్ష జరుగుతుండగా హౌసింగ్ పనులపై ఒకసారి, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులపై మరోసారి సభ్యుల మధ్య రచ్చ చోటు చేసుకుంది. హౌసింగ్‌పై జరిగిన చర్చలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఉత్తరకంచి, ప్రత్తిపాడు ఎంపీటీసీలు ఉమ్మిడి తాతీలు, సీంద్రపు భాస్కరరావు హౌసింగ్ అధికారిని ప్రశ్నించారు. శరభవరంలో జరిగిన ఉపాధి పనుల్లో ఏతప్పు చేయని ఫీల్డ్ అసిస్టెంట్‌ను అకారణంగా తొలగించారని, పక్క గ్రామంలో నిధులు మేసేసినా చర్యలు తీసుకోలేదని ఆ గ్రామ ఎంపీటీసీ అమరాది కాశీ విశ్వనాథం ఉపాధి ఏపీఓ కుమారస్వామిని నిలదీశారు. ఈ రెండు సందర్భాల్లోనూ శరభవరం సర్పంచ్ అమరాది వెంకట్రావు బదులివ్వడంతో వారి మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. తప్పు చేయడం వల్లే ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించామని ఆ గ్రామ సర్పంచ్ వెంకట్రావు బదులివ్వడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చినికిచినికి గాలివానగా మారి వివాదం తారస్థాయికి చేరుకుంది. చివరికి వైఎస్సార్ సీపీ, టీడీపీ పార్టీల సభ్యులు ఒకరిపై ఒకరు ఆరోపణ-ప్రత్యారోపణలతో సభ కొద్ది సేపు దద్దరిల్లింది. వారి మధ్య వివాదం ముదురుతోందని గ్రహించిన ఎంపీడీఓ, ఎంపీపీ, జెడ్పీటీసీ, పోలీసులు జోక్యం చేసుకుని వివాదాన్ని చక్కదిద్దారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక, ఉద్యాన, విద్య, నీటి పారుదల, డీఆర్‌డీఏ వెలుగు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు జి.సుబ్బలక్ష్మి, సుంకర వరలక్ష్మి, ఎ.శ్రీవల్లి, రాంజీ, ఎస్‌కే అబ్రహం, వై.వెంకట్, ఎం.సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాంతి సుధాకర్



ఇరువర్గాలకు సర్ది చెబుతున్న ఎంపీడీఓ కుమార్ బాబు, పోలీసులు

క్లుప్తంగా

రామాలయంలో ప్రత్యేక పూజలు



రమణయ్యపేటలో కోదండ రాముడిని దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: రమణయ్యపేటలో వేంచేసిన కోదండరామస్వామి ఆలయం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోదండరాముడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మట్లాడుతూ గ్రామ శ్రేయస్సు కోసం కలిసి ఆలయం వద్ద ఏకాహం, ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సిటిజన్స్ సర్వే త్వరగా పూర్తి చేయాలి



సిటిజన్స్ సర్వేపై సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ సాయి నవీన్

తుని రూరల్: సిటిజన్స్ సర్వేలో ఇప్పటికీ నమోదు కాని కుటుంబాలను త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ కె.సాయి నవీన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. సిటిజన్స్ సర్వేలో అన్ని కుటుంబాలను నమోదు చేయాలని, సంబంధిత యాప్‌లో ఏ విధంగా నమోదు చేయాలో సమగ్రంగా వివరించారు. హౌస్ హోల్డ్ ఆధారంగా సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వర్క్‌షాపు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టమ్‌పై ఐదు రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. రిసోర్స్‌పర్సన్ సీహెచ్ సంతోష్ మాట్లాడుతూ ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లు, ఏటీఎం, జీపీఎస్, టీవీ, విద్యా పరికరాలు, కెమెరాలు ఎంబెడెడ్ సిస్టమ్స్ ద్వారానే నడుస్తున్నాయన్నారు. ఎంబెడెడ్‌తో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ డీన్ వైకేఎస్ సుబ్బారావు, ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎం.రవీంద్ర, కో ఆర్డినేటర్ ఎం.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాయిబాబా మందిర వార్షికోత్సవం



బెండపూడిలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

తొండంగి: మండలంలోని బెండపూడిలో సాయిబాబా మందిర తొమ్మిదో వార్షికోత్సవం సోమవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు, పంచహారతులు, అభిషేకాలు, పుష్పార్చన, గ్రామోత్సవం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం మందిర ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన ఐదు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఉపాధి పనుల కేటాయింపు

తుని రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు మరిన్ని పనులు కేటాయించినట్టు ఏపీఓ పి.నారాయణరావు సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు చేస్తున్న పనులతో పాటు అధనంగా కేటాయించిన కొత్త పనులు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. మండలానికి కొత్తగా సోప్ పిట్లు (ఇంకుడు గుంతలు) రెండు వేలు, ఫారం పాండ్లు, పంచాయతీకి 20 ఎకరాల్లో ట్రెంచ్‌లు, గోకులాలు తదితర పనులు మంజూరైనట్టు తెలిపారు. ఒక్కొక్క సోప్ పిట్‌కు రూ.6 వేలు, ఐదు అడుగులు వెడల్పు, తొమ్మిది అడుగులు పొడవు, రెండు మీటర్ల లోతు గల ఫారం పాండ్లకు (112 పని దినాలు) రూ.60 వేలు, ఆరు పశువుల షెడ్లకు రూ.2.30 లక్షలు, నాలుగు పశువుల షెడ్లకు రూ.1.85 లక్షలు చెల్లిస్తామన్నారు. సాగు నీటి చెరువుల్లో నీటి నిల్వ ఉండడంతో ఈ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. కూలీలు, రైతులు ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటిక పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కాకినాడ దంటు కళాక్షేత్రంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కిర్లంపూడి: కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనల పోటీల్లో తామరాడ జెడ్పీ ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. లఘు నాటికలు జూనియర్స్ విభాగంలో 'అయ్యా నే బడికి పోతా' నాటికకు ద్వితీయ స్థానం, సీనియర్ విభాగంలో 'మాతృదేవోభవ' నాటికకు తృతీయ స్థానం దక్కించుకున్నారు. నాటికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సోమవారం తామరాడ పాఠశాలలో విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన సివిక్స్ అధ్యాపకుడు బావిశెట్టి లక్ష్మీనారాయణ, విద్యార్థులను హెచ్ఎం ఎన్.కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్యదేవుని దర్శించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్



సత్యదేవుని వ్రతమాచరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

అన్నవరం: కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు. వారి వెంట ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు గ్రామానికి చెందిన రేఖ ముసలి భార్య ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండి రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు శెట్టి సత్తిబాబు, టేకు రాజబాబు, ఎలుగుబంటి బాబ్జి, చెక్కపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.